www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 25 జులై 2024

బాధ్యతలు స్వీకరించిన జెసి ఆదర్శ్



బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించే ముందు బుధవారం ఉదయం కలెక్టర్ శ్రీధర్ చామకూరిని రెవెన్యూ అతిథి హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన జాయింట్ కలెక్టర్‌కు డిఆర్‌ఒ సత్యనారాయణరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

నేడే ఆశల బడ్జెట్

- 'పయ్యావుల'పైనే భరోసా
- 'ఉక్కు' పరిశ్రమకు కదలికొచ్చేనా?
- రూ.1,300 కోట్లతో ఇరిగేషన్ ప్రతిపాదనలు
- రాయలసీమ మిటిగేషన్ ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్-2024-25 సమర్పణకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి పయ్యావుల కేశవ్ అక్టోబర్ నాటికి సంబంధించిన స్వల్ప కాలిక బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు చేయనున్న కేటాయింపులపై అందరి దృష్టి నిలిచింది. రెండేళ్ల కిందట నుంచి జిల్లాలో పారిశ్రామికానికి మౌలిక వసతుల కల్పనలో కదలిక వచ్చినప్పటికీ పరిశ్రమల ఏర్పాటు నానాటికీ ఆలస్యమ వుతోంది. జిల్లా ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు సుమారు రూ.1,330 కోట్లు, పెండింగ్ బిల్లులు రూ. 830 కోట్లు చెల్లించాలని కోరుతూ ప్రతిపాదనలు అందజేసింది. రాయలసీమ మిటిగేషన్ ప్రాజెక్టు, జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 ప్యాకేజీ పనులు, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతలు, రాజోలు, జొలదరాశి, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు కేటా యింపులు చేయాల్సి ఉంది. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార పర్య టనల సందర్భంగా సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ నిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామనే హామీ నేపథ్యంలో గతంలో జమ్మలమడుగు నియోజకవర్గం కంబాలకుంటలో శంకు స్థాపన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఉక్కు పరిశ్రమను మూడేళ్లలో ఏర్పాటు చేస్తామని హామీని నెరవేర్చని సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కూటమి అభ్యర్థులను ప్రజానీకం పట్టం కట్టింది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులు రివర్స్ టెండరింగ్‌తో నిలిచిపోవడం తెలిసిందే. అనం తరం ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 ప్యాకేజీ-3 పనులకు టెండర్లు నిర్వహించడం మినహా మిగిలిన ప్యాకేజీ-4, ప్యాకేజీ-5, ప్యాకేజీ-6, ప్యాకేజీ-7 పనుల్లో ఎటు వంటి పురోగతి లేకుండా పోయింది. దీనికితోడు రూ.1357 కోట్లతో రాజోలి, రూ. 1312 కోట్లతో జొలదరాశి, రూ.564 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతల, రూ. 5,000 కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం భూసేకరణ, అడ్డంకుల కార ణంగా ముందుకు సాగడం లేదు. ఇదేతరహాలో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్ పనులు సాకా రానికి నోచుకోలేదు. జిల్లావ్యాప్తంగా గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వా సితుల సంగతిని పట్టించుకోవడం లేదు. గండికోట నిర్వాసితులకు పెంచిన పరి హారం ఎప్పటికి అందుతుందో తెలియడం లేదు. తెలుగుగంగ, చిత్రావతి, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల లీకేజీ పనులు దశాబ్దాల తరబడి నిరీక్షిస్తుండడం తెలిసిందే. ఇదిలాఉండగా తెలుగు గంగ ఇంజనీరింగ్ యంత్రాంగం తాజాగా రూ.125 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపించింది. రాయలసీమ మిటి గేషన్ ప్రాజెక్టు, జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 ప్రతిపాదనలకు సంబంధించిన కేటాయి ంపులు ఏమేరకు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

అన్ని కోణాల్లో విచారణ

విఆర్‌కు సిఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్ - ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిసోడియా, అగ్నిమాపక శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోంది. విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. మూడు రోజులుగా రెవెన్యూ, పోలీసు, సిఐడి అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో కుట్రధారులుగా అనుమానిస్తున్న పలువురు రెవెన్యూ అధికారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మదనపల్లె ఆర్‌డిఒగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్‌డిఒ హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను పోలీసులు సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే వరుసగా మూడోరోజు కూడా విచారణ చేస్తున్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పి, సిఐడి అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికితీయడానికి అధికార బృందం చర్యలు చేపట్టింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఈ ఘటనలో కీలక పాత్రధారిగా భావిస్తూ ఆయన కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

సచివాలయాల్లో స్పెషల్ సిఎస్ తనిఖీ

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ బుధవారం మదనపల్లి సబ్ డివిజన్‌కు సంబంధించి సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మదనపల్లి మండలం వెంకటప్ప కోట గ్రామంలో మ్యాపింగ్ చూసి సర్వే రాళ్లను పరిశీలించారు. అనంతరం మదనపల్లి మండలం వెంకటప్పకోట, చిన్నతిప్పసముద్రం ఒకటిలో గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్నటువంటి ఎఫ్‌ఎల్‌ఆర్ రిజిస్టర్, అడంగల్, ఆర్‌ఒఆర్ 1(బి), 10(1) డిజిటల్ సర్వీస్ లకు సంబంధించిన రికార్డులను ఎలా నమోదు చేస్తున్నారని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతోందని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్‌ను రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లి తహశీల్దార్ రమాదేవి, సర్వేయర్లు, విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పరిశీలన

బుధవారం ఉదయం అగ్నిమాపకశాఖ డైరెక్టర్ పి.వి.వెంకటరమణ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే ఎవరు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు, సిబ్బంది వచ్చినప్పుడు కార్యాలయంలో ఎవరెవరు ఉన్నారనే దానిపై ఆరా తీశారు. ఆయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్‌కుమార్, మదనపల్లె అధికారి శివప్ప వచ్చారు. ఘటన జరిగిన తీరు, వివిధ అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విచారణను వేగవంతం చేస్తున్నాం : ఎస్‌పి

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్స్ దగ్ధం చేసిన ఘటనలో విచారణను వేగవంతం చేశామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు కానిస్టేబుళ్ల హరిప్రసాద్, భాస్కర్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశామని తెలిపారు. రాత్రి బీట్ సెక్షన్‌లో ఉన్న ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటలు చెలరేగితే ఆ ఘటనను ఉన్నత స్థాయి అధికారులకు తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం వహించడంతో చర్యలు తీసుకున్నామన్నారు. సిఐ వల్లిబషు జరిగిన సంఘటనను వెంటనే డిఎస్‌పి, ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లకపోవడంతో అతన్ని విఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సంఘటన జరిగిన రోజునుంచే పరిసరాలు డిస్టర్బ్ కాకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మూడవ వ్యక్తి లోనికి రాకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. సంఘటనతో సంబంధం ఉండే అవకాశం ఉందన్న అనుమానం కలిగిన 30 నుంచి 35 మందిని ఇప్పటికే విచారించామని, విచారణ త్వరలోనే తుది దశకు చేరుకుంటుందని తెలిపారు. కార్యాలయంలో ముఖ్యమైన ఫైళ్లను మాయం చేసి ఆ తరువాత అవి ప్రమాదంలో కాలి పోయినట్లు సృష్టించేందుకు కార్యాలయానికి నిప్పు పెట్టారన్న వదంతులు వినిపిస్తున్నాయని విలేకర్లు అడగ్గా అసలు అందులో ఏయే ఫైల్స్ ఉన్నాయి వాటి ప్రభావం ఎంత అనేది కదా ముందు తెలియాల్సి ఉందన్నారు. కాలుతున్న 700 ఫైల్స్‌ను ఆ శాఖ అధికారులకు అందజేశామని, ఆ ఫైల్స్ యొక్క తీరు, వాటి ప్రభావాన్ని అంచనా వేసిన తరువాతనే ఏ స్థాయిలో నేర తీవ్రత ఉందో నిర్ధారణకు రావచ్చన్నారు. విచారణలో ప్రతి చిన్న అంశాన్ని వదలకుండా లోతుగా, సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే ఈ కేసును పూర్తి చేస్తామని తెలిపారు.

సచివాలయంలో తనిఖీలు చేస్తున్న సిసోడియా, కలెక్టర్ శ్రీధర్, జెసి స్వరూప్

నేడు భూవివాదాల సమస్యలపై వినతుల స్వీకరణ

అన్నమయ్య జిల్లా మదనపల్లికి విచ్చేసిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా మదనపల్లి సబ్ డివిజన్‌కు సంబంధించిన భూ వివాదాల సమస్యలను స్వీకరిస్తారని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటల నుండి సిసోడియా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. మదనపల్లె సబ్ డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించిన గత 2 నుంచి 3 సంవత్సరాల భూ వివాదాల సమస్యలను సిసోడియాకు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎంపిడిఒ టి.యోగానందరెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ జిఒ నెంబర్ 117 రద్దు చేయాలని కోరారు. ఫ్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5వ తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పాఠ్యాంశం, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి పని భారం తగ్గించాలని, ఉన్నత పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఒక కిలోమీటరు పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్నం భోజనం మెనూ సవరించాలని అన్నారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని, గిరిజన ప్రాంతాలలో ప్లస్ టు పాఠశాలలను ఏర్పాటు చేయాలని తెలిపారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సిఆర్‌టిలను, భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు జి.నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి కే.శివయ్య, కోశాధికారి కే.రామచంద్ర, ఉపాధ్యక్షులు పి.రవి చంద్ర ప్రసాద్, జిల్లా కౌన్సిలర్లు కే.శివ కుమార్, ఆర్.సుబ్రమణ్యం, యు.వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు ఏ.చంద్రయ్య, ఎం.వెంకట రమణ, జి.లింగప్ప నాయుడు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతి పత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్

శరవేగంగా అన్న క్యాంటీన్ పనులు

ప్రజాశక్తి-రాయచోటి

ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 136 అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభం కాబోతున్నాయి. రాయచోటి మాసాపేట మార్కెట్ యార్డులో ఉన్న అన్న క్యాంటీన్ ప్రహరీ గోడ, పునరుద్ధరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం 2014 నుండి 2019 వరకు అధికారం ఉన్నంత వరకు పేద ప్రజలకి తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందించే దిశగా ఇవి ఏర్పాటు చేసిందన్నారు. ఆ తరవాత వైసిపి ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేయడంతో పాటు అన్న క్యాంటీన్ బిల్డింగ్‌లను నిరుపయోగంగా వదిలేసిందన్నారు. మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభం చేయడానికి పనులు చేపట్టిందని చెప్పారు. పనులు పూర్తికావచ్చాయని తెలిపారు.

సమగ్ర దర్యాప్తు అవసరం : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఘటనపై సమగ్ర దర్యాప్తు అవసరమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం పత్రాల దహనం పైన సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. పెద్ద ఎత్తున 22 ఎ ఫైల్స్ దహనం జరిగిందనే వాస్తవాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో దీనికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులే కారణమని ఆరోపణలు చేశారు. మాజీ ఆర్‌డిఒ మురళి ఓ పెట్రోల్ బంకు ఓనర్ తోకలిసి మూడున్నర ఎకరాల డికెటి భూమిలో ప్లాట్లు వేసి అమ్మకం చేశారని, మరో ఒకటిన్నర ఎకరా బినామి పేర్లతో స్వాహా చేసాడని పేర్కొన్నారు. పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో గెస్ట్ హౌస్ నిర్మించుకోవడంతో పాటు తన అల్లుడికి హార్సిలీ హిల్స్ కింద 60 ఎకరాల ప్రభుత్వ భూములు అక్రమంగా కట్టబెట్టడం లాంటి ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడిన మురళిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజంపేట పార్లమెంటు మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి అన్వర్‌బాష, గణేష్, నసీబ్, పిల్లి రవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే శరీరానికి మానసిక ఉల్లాసం లభిస్తోందని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 3వ రోజు విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంప్రదాయ క్రీడలైన ఖోఖో, చెమ్మ చెక్క, అష్టచెమ్మ, రింగ్, మేకాపులి, తాడు ఆట, భారాకట్ట, యోగాసనాలు తదితర ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతన, ఏకాగ్రతను వెలికితీయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పిడి ఉమాదేవి, ఉపాధ్యాయులు నాగరత్న, పుష్పలత, వసుంధర, వేదవాణి, రాధ, అనురాధ, రేణుక, శంషాద్, సునిత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న జెడిఎ చంద్రానాయక్

అంతర్ పంటలతో అధిక లాభాలు

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పంటలలో అంతర్ పంటలు వేయడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని జర్రావారిపల్లిలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ ఆధ్వర్యంలో రైతులకు, కౌలు రైతులకు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశెనగలో విత్తనశుద్ధి, అంతరపంటలసాగు, లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుగు జిగురు అట్టల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతులలో వ్యవసాయం చేసే రైతులకు వాతావరణ పరిస్థితులకు, నేల రకం ఆధారంగా పండించే పంటలు, పురుగుల గురించి, నివారణా చర్యల గురించి తెలపడమే పొలంబడి కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. అలాగే పంటలకు అవసరమైన సమాచారాన్ని, రైతులకు అందుబాటులో ఉన్న పథకాలు, సబ్సీడీలపై రైతులకు తెలియజేయాలన్నారు. అలాగే ప్రతి ఒక్క కౌలు రైతు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒలు హేమలత, రమేష్‌రాజు, సిబ్బంది ఎస్.ఆర్ బాబు, అబ్దుల్ ఖాదర్, గిరీష్, స్వాతి, హరినాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు

ప్రజాశక్తి-రాయచోటి

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఇఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. సంబేపల్లి మండలం మోటకట్ల జడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నాగిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతూ విద్యాపరంగా, సామాజికపరంగా ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు నాగిరెడ్డి తమ బాధ్యతను ఏమాత్రం విస్మరించకుండా, ఏ పాఠశాలలో పనిచేస్తున్నా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంతో కృషి చేశారని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేయడంలో, పలు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడంలో ముందంజలో నిలిచారని కొనియాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు నాగిరెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు సహదేవరెడ్డి, డిసిఇబి కార్యదర్శి నాగముణి రెడ్డి, ప్రధానో పాధ్యాయులు శివయ్య, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిని సన్మానిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లి

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో డిప్లొమా చేసి ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు తరగతులను బుధవారం ప్రారం భించారు. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ రామనాథన్, డాక్టర్ తులసీరామ్ నాయుడు, విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులను తమపై ఉన్న నమ్మకంతో తమ పిల్లలను ఇక్కడ చేర్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , ప్రపంచ ప్రఖ్యాత గాంచిన యూనివర్సిటీలకు సంబంధించిన అద్యాపకులు మిట్స్‌లో ఉన్నారని, విద్యార్థులకు నాణ్యత మైన విద్యను అంది స్తా మని తెలిపారు. కళాశాల లోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్న్‌షిప్‌లను అందిస్తున్నామని, బి.టెక్ కోర్స్ పూర్తి అయి న తరువాత ఎంఎస్ కూడా విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు పరిశోధన రంగం లో రాణించాలని, ఇంటర్ డిని ప్లెనరీ పరిశోధనలపై దృష్టి సాధించాలని సూచించారు. మా కళాశాలకు యెన్.బి.ఎ మరియు నాక్ ఎ ప్లస్ అక్రిడిటేషన్‌లు ఉన్నా యని అన్నారు. విద్యార్థులు కళాశాలలో గల ల్యాబ్, లైబ్రరీ, ఇన్నోవేషన్ సెల్, మొదలైన వాటిని సకాలంలో వాడుకోవాలని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామంలో నీట మునిగిన పంట పొలాల పేద రైతులను రాష్ట్ర కూటమి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు అమీర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు షర్మిల మంగళవారం తాడేపల్లిగూడెం మూరుమూల గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను సందర్శించి పరిశీలించిన విషయం ప్రభుత్వానికి తెలిసిందే అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఖాదర్‌ఖాన్, మస్తాన్, అమిర్‌బాషా, అంజద్ ఖాన్ పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి 'చమర్తి' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని పోలి గ్రామపంచాయతీ శేషన్నగారిపల్లె గ్రామానికి చెందిన కేన్సర్‌తో బాధపడుతున్న ఎద్దులపల్లి వెంకటసుబ్బయ్యను బుధవారం టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అండగా ఉంటానని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి మాజీ మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న జగన్మోహన్‌రాజు

కష్టాల్లో కడప, విశాఖపట్నం జట్లు

తలపడుతున్న కడప, వెస్ట్ గోదావరి జట్లు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎసిఎ అండర్-19 గ్రూప్-బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన మ్యాచ్‌లో కడప, వెస్ట్‌గోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రణధీర్ రెడ్డి 49, గురు చరణ్ 46 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టులోని చరణ్ సాయి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది.

సంతోష్ సెంచరీ... భారీ స్కోరు దిశగా శ్రీకాకుళం

కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఎన్.సంతోష్ సెంచరీ చేయడంతో శ్రీకాకుళం జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో 119 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎస్.ఎస్.హమీద్ 42 పరుగులు చేశాడు. శ్రీకాకుళం జట్టులోని పూర్ణచంద్ర అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. జున్నారావు 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 59.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 262 పరుగుల భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. ఆ జట్టులోని ఎన్.సుశాంత్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణిస్తున్నాడు. 180 బంతులను ఎదుర్కొని 26 బౌండరీల సహాయంతో 127 పరుగులు చేసి (నాటౌట్)గా నిలిచాడు. పి.ఎస్.విగ్నేష్ 58 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని ఎస్.ఎస్.హమీద్ వికెట్లు తీసుకున్నాడు.

మొదటి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసిన చిత్తూరు

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం, చిత్తూరు జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 88.1 ఓవర్లలో ఆటో ముగిసే సమయానికి 286 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వరుణ్ 79 పరుగులు చేశాడు. విశాఖపట్నం జట్టులోని దేవాశిష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. యశ్వంత్ 2 వికెట్లు తీసుకున్నాడు.

భోజనాన్ని పరిశీలిస్తున్నఎంఇఒ నాగ తిరుమలరావు

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్సీ కాలనీ, గొల్లవారిపల్లిలో బుధవారం మండల ఎంఇఒ నాగ తిరుమల రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని తరగతి గదులను, వంటశాలను, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీశారు. వత్తలూరు జడ్పి హైస్కూల్లో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. నాడు-నేడు పనుల స్థితిగతుల గురించి అధ్యయనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. బియ్యం, గుడ్లు తదితర వాటి గురించి ప్రధానోపాధ్యాయురాలును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కూళ్లకు విద్యార్థులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకువస్తే అధికారులకు చేరవేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ప్రధానోపా ధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చీకటివాండ్లపల్లెను వణికిస్తున్న విషజ్వరాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాళ్లపల్లిలో పిల్లలు విష జ్వరాల బారిన పడి అల్లాడి పోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గ్రామాలలో దోమల బెడదతో మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు బారిన పడి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు, గుంతలు నీరు నిలవడం వల్ల దోమలు ఉత్పత్తి పెరిగిందని అన్నారు. గ్రామంలో సుమారు పదిమంది పిల్లలు విష జ్వరాలు బారిన పడటంతో రాయచోటి, కడపకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. దీక్షిత అనే బాలికకు డెంగీ వచ్చిందని డాక్టర్లు చెప్పడంతో గ్రామంలో ప్రజలు వణికపోతున్నారు. అధికారులు, వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి - బి. కొత్తకోట

దేశంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై పెద్ద ఎత్తున దాడులకు పూనుకున్నదని, కార్మిక వర్గం అనేక పోరాటాలు త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను,హక్కులను నిర్వీర్యం చేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేసి కార్పోరేట్లకు పంచుపెడుతున్నదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు విమర్శించారు. బుధవారం ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో రెండు రోజులపాటు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను ఓబులేసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ వికసిత (అభివృద్ధి) భారత్ 2024,2025 బడ్జెట్ తోడ్పడుతుందని ముందుగానే మీడియాలో కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేశారు. తీరా చూస్తే కార్మికవర్గానికి నిరాశ కలిగించిందన్నారు.ఈ జడ్జెట్ వలన ప్రైవేటీకరణ తీవ్రం అవుతుందన్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విరమిస్తూ ప్రతిపాదన చేయలేదని విమర్శించారు.ఎ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంధ్రనాథ్, గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులు రామారావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు తులసేంద్ర, రామచంద్రయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వీరబల్లి విద్యుత్ శాఖ ఎఇ రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వీరబల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

వాల్మీకి సంఘం యువజన అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-గాలివీడు

రాష్ట్ర వాల్మీకి సంఘ యువజన అధ్యక్షులు బండి వెంకటసాయి పరుశురాంను రీడ్ సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, అర్చన కళాశాల ప్రిన్సిపల్ పరశురామ్, బండి హరిలులు పూలమాల,దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటసాయి తన ప్రతిభతో చిన్న వయస్సులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అభినందించారు. వాల్మీకుల సమస్యల కోసం పోరాటం చేయాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ సతీమణి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పక్కిరరెడ్డిగారిపల్లి మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నారాయణరెడ్డి భార్య కొండ్రెడ్డి నాగమణి(70) చెన్నైలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం ఆమె మృతదేహాన్ని గాలివీడుకు తీసుకొని వచ్చి దహన సంస్కారాలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలకు మాజీ శాసనసభ్యులు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణరెడ్డి, గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్‌లు దాసరి నాగిరెడ్డి, తూముకుంట సర్పంచ్ రవికుమార్ నాయుడు, మాజీ లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేడెం.లక్ష్మయ్య, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో క్షేత్ర సహాయకుడు..

ప్రజాశక్తి-పీలేరు: ముడుపులవేముల పంచాయితీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు గుండెపోటుతో మృతి చెందినట్లు ఎంపిడిఒ ఉపేంద్ర తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్న పి. నాగార్జున బుధవారం ఉదయం గుండెపోటుతో ఇంటిదగ్గర కుప్పకూరడంతో కుటుంబ సభ్యులు అతన్ని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించినట్లు తెలిసింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఉపాధిసిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ విభాగంలో సహాయ ఆచార్యురాలుగా పనిచేస్తున్న ఎస్‌సి అల్లూరయ్యకు విఐటి యూనివర్సిటీ వేలూరు వారిచే పిహెచ్‌డి ప్రదానం చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ తెలిపారు. వీరు 'మల్టీ ఆప్టిమైజేషన్ అండ్ టెక్నో ఎకనామిక్ డిజైన్ ఆఫ్ ఏ హైబ్రీడ్ మైక్రోగ్రిడ్ సిస్టమ్ విత్ రెనోవబుల్ ఎనర్జీ సోర్సస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు. వీరు డాక్టర్ పి.విజయప్రియ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, విఐటి యూనివర్సిటీ వేలూరు వారి పర్యవేక్షణలో పిహెచ్‌డి చేసినట్లు తెలిపారు. తాను చేసిన పరిశోధన వలన హైబ్రిడ్ మైక్రో గ్రిడ్ సిస్టమ్‌ను డిజైన్ చేసి సులభంగా రిమోట్ విలేజస్‌కు సస్టేయనబుల్ పవర్‌ను తక్కువ పర్ యూనిట్ కాస్ట్‌తో సప్లై చేయవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత, డీన్‌లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం అల్లూరయ్యను అభినందించారు.

CHANGE OF NAME

I ,Saudha khanam (Old Name) S/o patan Deshmuk Alli Murad Feroz, R/o 7/270 Pullampeta V & P & mandal ANNAMAYYA (Dist), AP.

I have been changed my name as Pathan souda khanam s/o pathan Deshmuk Alli Murad Feroz (New Name).

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు : కమిషనర్

బి.కొత్తకోట: పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ పి.ఆర్.మనోహర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. డయేరియా కార్యమంలో భాగంగా బుధవారం బిసి కాలనీ వాటర్ ప్లాంట్ సమీపంలో మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండుటకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడం,వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా,టైఫాయిడ్ డయేరియా వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. పారిశుధ్యంపై ఎవరూ నిర్లక్ష్యం వహిం చవద్దని కోరారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. **ప్రజాశక్తి-నిమ్మనపల్లె :** గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలపై నిర్లక్ష్యం వహించవద్దని రాచవేటి వారిపల్లె సర్పంచ్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం రాచవేటి వారిపల్లె సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి మారెప్పతో కలిసి సచి వాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్యంపై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి ఆగస్టు నెల 5వ తేదీ వరకు మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యంపై ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో మురు గనీటి కాలువలను శుభ్రం చేయించడం, చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించడం, నీటి ట్యాంకర్‌ను శుభ్రపరచడం, నీటి కుళా యిల లీకేజీలను అరికట్టడం, మురుగునీటి నిల్వలను, నీటి గుంటల నిల్వలను గుర్తించి తొలగించడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక కార్యచరణను నిర్దేశించి ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి ఒక్క సచివాలయ ఉద్యోగి వారి క్లస్టర్‌లోని గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులు కూడా వారికి కేటాయించిన విధుల్లో తప్పక పాల్గొనాలని పేర్కొన్నారు. మురుగునీటి నిల్వలను తొలగించి దోమలు ప్రబలకుండా అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమాలపై ప్రతిరోజూ ఉన్నతాధికారులు సమీక్షిస్తారని, క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తారని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వహించకుండా పారిశుధ్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారప్ప, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం : డిఇఒ

రామాపురం : క్రీడల్లో పాల్గొన్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-రామపురం

క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పి తెలుగు, ఉర్దూ పాఠ శాలల్లో ఆయన పర్యటించారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరుపట్టి, రికార్డులను పరిశీలించారు.విద్యాభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 22 నుండి 28 వరకు జరుగుతున్న శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంసాంస్కృతిక, క్రీడా పోటీలోల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. క్రీడలతో శారీర దారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, సయ్యద్ మజాహారుల్ హుక్ , విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు వత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా రాణించాలని పేర్కొన్నారు. క్రీడల్లో పతకాలు సాధిస్తే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంఘరాజు వెంకట సుబ్బరాజు, పీడీ కొమ్మ పార్థసారథి, సిఆర్‌పిలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఒలు

టిడిపి నేతపై హత్యాయత్నం.. విచారించిన డిఎస్‌పి

గిరినాయుడుతో మాట్లాడుతున్న డిఎస్‌పి రామచంద్రారావు

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోని కావలిపల్లె పంచాయతీ, ఒంటిల్లులో టిడిపి నేత గిరి నాయుడుపై జరిగిన హత్యాయత్నంపై రాయచోటి డిఎస్‌పి రామచంద్రారావు విచారణ చేపట్టారు. హత్యాయత్నం ఘటన జరిగిన గిరి నాయుడు ఇంటిని బుధవారం డిఎస్‌పి, పీలేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. సంఘటన గురించి, వచ్చిన ఆగంతకులు, వారి వ్యవహరించిన తీరు గురించి గిరి నాయుడిని అడిగి తెలుసుకున్నారు. తనపై దాడి చేయడానికి వచ్చిన వారు ముఖాలకు మాస్కులు, చేతులకు తొడుగులు వేసుకుని ఉన్నట్లు గిరి నాయుడు పోలీసులకు వివరించారు. వచ్చిన నిందితులతో ప్రతిఘటించాక వారు తమతో తెచ్చుకున్న ఐదు ద్విచక్ర వాహనాల్లో రాయచోటి వైపు పరారీ అయినట్లు చెప్పారు. అనంతరం డిఎస్‌పి, సిఐ ఒంటిల్లు సమీపంలోని టోల్ ప్లాజాకు చేరుకుని అక్కడున్న సిసి టివి ఫుటేజ్ లను పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గిరి నాయుడు ఉదంతంలో సమగ్ర విచారణ ప్రారంభించామని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పాటు సంఘటన జరిగిన సమయంలో గిరినాయుడి ఇంటి పరిసర ప్రాంతాల్లోని సెల్‌ఫోన్ వివరాలను కూడా సేకరిస్తున్నామని తెలిపారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. తమ నేతపై హత్యాయత్నం జరిగిందన్న విషయం తెలియడంతో టిడిపి నాయకులు ఒంటిల్లుకు చేరుకుని గిరినాయుడిని పరామర్శించారు.

రజకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న హత్యలు, దాడులు పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రజక సంఘం అధ్యక్షులు టి. రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పాలకులకు, డిజిపి, పోలీసు యంత్రాంగాన్ని వేడుకుంటున్నామని అన్నారు. సమాజంలో ప్రజలకు సేవ చేసే నిస్సహాయకమైనటు వంటి రజక జాతి ఈరోజు హత్యలకు గురికావడం చాలా వేదనకు గురిచేస్తోందని అన్నారు. ఒక బలహీనమైన కులాన్ని ఇంతగా హత్యలకు గురి చేయడం దీనికి నిదర్శనం అన్నారు. నేటికైనా రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చి, రాష్ట్రంలో మహిళలు రజకులు మానప్రాణాలతో బతికే అవకాశం కల్పించమని ఈ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని అన్నారు. వారం రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రజక జాతికి చెందిన శీనుపై అత్యంత దారుణంగా దాడి చేసి పారేసిన సంఘటన మరువక ముందే మరో సంఘటన రజకున్ని రాష్ట్రంలో దారుణ హత్య వెలుగులోకి రావడం భయానక పరిస్థితులకు ఈ రాష్ట్రంలో అద్దం పడుతుందన్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం కొత్తకోట సమీపంలో వెల్దుర్తి గ్రామానికి చెందిన చాకలి సూర్యనారాయణ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా నరికి హత్య చేశారు అన్నారు. తక్షణమే రజకులపై జరుగుతున్న దాడులు అరికట్టి వాటికి బాధ్యులైనటువంటి వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి చట్ట ప్రకారం వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఎం.వి.రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం, ప్రిన్సిపల్, కోచ్

కరాటేలో నారాయణ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో నారాయణ స్కూల్ (పకీరు పల్లె) విద్యార్థులు ప్రతిభ చాటారని ఎజిఎం చెన్నకేశవరాజు, ప్రిన్సిపల్ రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రతిభ చూపిన విద్యార్థులను అబినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదులోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలు ఈనెల 21న నిర్వహించారని తెలిపారు. కరాటే పోటీలలో 3 గోల్డ్, 3 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు. విద్యార్థులను ఎఇ విజయ్, హైస్కూల్‌డీన్ కృష్ణ, ఇన్‌ఛార్జి మల్లేశ్వరి, మనీషా అభినందించారు.

మదనపల్లె వన్‌టౌన్ సిఐగా ప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె వన్‌టౌన్ సిఐగా ప్రసాద్ ను నియమిస్తూ ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాయచోటి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధుల్లో ఉన్న సిఐ వల్లిబషు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అతన్ని విఆర్ పంపుతూ ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - వేంపల్లె : విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ సూచించారు. ఆర్‌జెయుకెటి పరిధిలోని ఒంగోలు ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌కు చెందిన అడ్మిషన్ల ప్రక్రియను బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలోని సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ట్రిపుల్‌ఐటికి ఎంపికైన మొదటి నలుగురు విద్యార్థులకు మొదటి అడ్మిషన్లను వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర సంద్రా అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు డైరెక్టర్ భాస్కర్ పటేల్, ఇడుపులపాయ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర, ఆర్కే వ్యాలీ పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఇమ్రాన్, రత్నకుమారి, ఒంగోలు క్యాంపస్ డీన్ రూపేష్, అసోసియేషన్ డీన్ చంద్రారెడ్డి, రోజర్ బిన్ని, రాఘవరెడ్డి, పిఆర్‌ఒ తిరుపతిరెడ్డి, క్యాంపస్ మెయింటెన్స్ ఆఫీసర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సెక్యూరిటీ ఇన్‌ఛార్జి శరవన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్,అధికారులు

మొక్కజొన్న విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న మొక్కజొన్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రాచవేటివారి పల్లె సర్పంచు సుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైతు సేవ కేంద్రం వద్ద పశుసంవర్ధక శాఖ అధికారులు భూదేవితో కలిసి రైతులకు రాయితీ మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులకు అండగా నిలవడానికి రాష్ట్ర ప్రభుత్వం పశుగ్రాసం కోసం రాయితీపై మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నాదన్నారు. మండలానికి 9 టన్నుల మొక్కజొన్న పశుగ్రాస విత్తనాలు వచ్చాయని, ప్రతి పంచాయతీలోను అందుబాటులో ఉన్నాయని పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ ఇప్పటికే తెలియజేశారని అన్నారు. ఒక్కొక్క కిలో రాయితీపెరూ.17లకు ఇస్తున్నట్లు వివరించారు. అవసరమున్న రైతులు పశు సంవర్ధక శాఖ అధికారులను కలిసి వారి ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను అందించి మొక్కజొన్న విత్తనాలను తీసుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారెప్ప, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న ప్రమీల రాజగోపాల్‌రెడ్డి

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి బాలిక ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరానికి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డాక్టర్ ప్రమీల రాజగోపాల్‌రెడ్డి తల్లి జ్ఞాపకార్థం కృష్ణమ్మ మెమోరియల్ మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా 576 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన ఎం.రుబీనాకు రూ.25 వేలు, 557 మార్కులు సాధించిన బి.వెన్నెలకు రూ.15వేలు, 550 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన టి.సుప్రియకు రూ.10వేలు చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో కలికిరి గ్రామ సర్పంచ్ ఎల్లయ్య, రెడ్డివారి యోగేష్‌రెడ్డి, ఎంఇఒ కరీముల్లా, ప్రధానోపాధ్యాయులు ఎన్.జయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న అధ్యాపక బృందం

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి-నందలూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను అధ్యాపకులు విద్యార్థులకు అందిస్తున్నారు. మండలంలోని నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలల విద్యార్థినులకు ప్రిన్సిపల్ జయలలిత కుమారి ఆధ్వర్యంలో అధ్యాపకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్దంగా చదువుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్, గంగనపల్లి వెంకటరమణ, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, రవిశంకర్ రెడ్డి, బోగా వెంకటసుబ్బయ్య, విజయ కుమారి, మస్తాన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నవ వధువు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సాయిప్రియ(ఫైల్ ఫొటో)

పట్టణంలోని నీరుగట్టువారిపల్లె బాబుకాలనీ, వెంకటేశ్వరపురంలో వివాహిత అనుమానస్పదస్థితిలో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..వెంకటేశ్వరపురంలో నివాసముంటున్న శ్రీనివా సులు, ఉష దంపతుల కుమారుడు మణికంఠ, ఆర్ టిసి బస్టాండ్ సమీపంలోని రామ్ నగర్‌కు చెందిన వెంకటరమణ, లక్ష్మిదేవిల కుమార్తె సాయిప్రియ (20)లు ఆరు నెలలక్రితం ప్రేమ వివాహం చేసు కున్నటు తెలిపారు. పెళ్లయినప్పటి నుంచి గొడవలు జరుగుతున్నా సర్దుకుపోతూ కాపురం చేస్తూనే ఉందన్నారు. భర్త మణికంఠ వ్యసనాలకు బానిసైనప్పటికీ ప్రేమ వివాహం కావడంతో పుట్టింటికి వెళ్లలేక లోలోపలే మదనపడుతూ కష్టమైన కాపురాన్ని నెట్టుకొస్తుందన్నారు. మంగళవారం అర్ధరాత్రి భర్త కొట్టడంతో చనిపోయిందని అనుమానాలు ఉన్నాయని మృతురాలితల్లి ఆరోపించారు. కమ్మికి ఉరేసు కున్న ట్లు చిత్రీకరించి, మృత దేహం మెడకు చీర చుట్టారని, నా కూతురిని హత్యచేశారని మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఆరోపిస్తోంది. విషయం తెలుసుకున్న తాలూకా పోలీసులు సంఘటన స్థ లానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతిరాలి తల్లి లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

వృద్ధురాలిపై దాడి చేసి ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-పీలేరు

ఓ వృద్ధురాలిపై గుర్తు తెలియని ముగ్గురు దుండగులు దాడి చేసి ఇంట్లో చొరబడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. బుధవారం పీలేరు పోలీసుల కథనం మేరకు జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి పీలేరు-మదనపల్లె మార్గంలోని హుమయూన్ కళ్యాణ మండపం వద్ద తన తల్లి కె.ఎస్.జెహరాబీతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఆమె ఒంటరిగా ఉండగా ఆ సమయంలో ముఖాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేయడమే కాకుండా ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బోదేషావలి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాయచోటి డీఎస్పీ రామచంద్ర రావు, పీలేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్లతో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఇంట్లోని రూ.60 వేల నగదుతోపాటు తన తల్లి ఒంటిపై ఉన్న రూ.3 లక్షల విలువచేసే ఒక బంగారు చైను, రెండు చేతి గాజులు, రెండు కమ్మలు, రెండు ముక్కుపుడకులు దుండగులు దోచుకెళ్లినట్లు బోదేషావలి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.